క్లుప్తంగా

పశువులకు హెల్త్ కార్డులు



పాడి రైతులకు హెల్త్ కార్డులు పంపిణీ చేసిన దృశ్యం

గడివేముల: పశువులకు కూడా ప్రభుత్వం హెల్త్‌కార్డులు అందజేస్తుందని పెసరవాయి పశువైద్యాధికారి బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. 35 మంది పశుపోషకులకు శుక్రవారం పెసరవాయిలో హెల్త్‌కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం హెల్త్‌కార్డులు మంజూరు చేస్తోందన్నారు. వీటి ద్వారా పశువులకు మెరుగైన వైద్యసేవలు పొందాలని యజమానులకు సూచించారు.

20న షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు

ఓర్వకల్లు: నంద్యాల జిల్లా పాణ్యం మండలంలోని పలుకూరు జెడ్పీ హై స్కూల్‌లో ఈ నెల 20న జిల్లా స్థాయి షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి బి.నరేష్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ 9 నుంచి 11వ తేదీ వరకు బాపట్లలో జరిగే అండర్ రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీలకు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 8639298051, 9160730288 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఇంటింటి సర్వేను త్వరగా పూర్తి చేయాలి



ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వీఆర్వోలు

కోడుమూరు రూరల్: బీఎల్‌ఓలు తమ బూత్ పరిధిలోని ఇంటింటికి వెళ్లి డిసెంబర్ 7వ తేదీ లోగా తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించాలని తహసీల్దార్ జయన్న సూచించారు. శుక్రవారం మండలంలో బీఎల్‌ఓలు ఓటరు జాబితాపై నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేపై తహసీల్దార్ సమీక్షించారు. ఓటరు జాబితాపై ఏవైనా అభ్యంతరాలుంటే ఫారం 6, 7, 8 ఫారాల్లో ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించాలని సూచించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

సి.బెళగల్: మండలంలోని పోలకల్ గ్రామంలో శుక్రవారం పోలీసులు సోదాలు నిర్వహించి అక్రమంగా విక్రయిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ మన్మథ్‌విజయ్ తెలిపిన వివరాలు.. కర్ణాటక మద్యం అమ్మకాలపై సమాచారం అందడంతో స్థానిక పోలీసులు, సెబ్ సిబ్బంది సోదాలు నిర్వహించారు. బోయ చనుగండ్ల నాయుడు వద్ద కర్ణాటక రాష్ట్రానికి చెందిన 40 ఒరిజినల్ చాయిస్ డిలాక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మద్యం ప్యాకెట్లను సీజ్ చేసి, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

కల్లూరు: మండలంలో కొర్ర, రాగులు, జొన్న పంటలను ప్రభుత్వం కనీస మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కొంగనపాడు, బస్తిపాడు, లక్ష్మీపురం, చిన్నటేకూరు, పెద్దపాడు, ఎ.గోకులపాడు, ఉలిందకొండ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో పంట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. శుక్రవారం కొంగనపాడు రైతు భరోసా కేంద్రంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటును ఏఓ పరిశీలించారు. ఈ-క్రాప్ నమోదు చేసుకొని ఈ-కేవైసీ పూర్తయిన రైతులు ఆర్బీకేలో వీఏఏ/వీహెచ్ఏలను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

కొత్తూరు ఆలయానికి మోటార్ విరాళం



మోటార్‌ను అందిస్తున్న భక్తులు

పాణ్యం: మండల పరిధిలోని ఎస్.కొత్తూరు గ్రామంలో వెలసిన ప్రముఖ శైవ క్షేత్రం శ్రీ సుబ్రమణ్యేశ్వర స్వామి దేవాలయానికి వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యార్థం విద్యుత్ మోటార్‌ను భక్తుడు విరాళంగా అందించినట్లు ఈఓ రామకృష్ణ శుక్రవారం తెలిపారు. బేతంచేర్ల పట్టణానికి చెందిన కామిరెడ్డి సుబ్బారెడ్డి మనువరాలు సుష్మ, చదువుల సుధాకర్‌రెడ్డి జ్ఞాపకార్థం మనుమడు నాగరుద్రాన్ష్ రెడ్డిలు కలిసి తమ ఇలవేల్పు స్వామివారి ఆలయానికి విరాళంగా 2 హెచ్‌పీ సింగిల్ 20 స్టేజీల సీఆర్‌ఐ కెంపెనీ విద్యుత్ మోటార్, పైపులను అంజేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రధానార్చకులు నారాయణ స్వామి, నాగేశ్వరరావు, సురేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

సకల సేవల నిలయం 'గ్రామ సచివాలయం'

- గ్రామీణ ప్రజలకు చేరువైన ప్రభుత్వ సేవలు
- కార్యాలయాల చుట్టూ తిరిగే పని తప్పిందంటున్న ప్రజలు
- గ్రామ స్థాయిలోనే సమస్యల పరిష్కారం
- పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- సీఎం జగనన్న పాలనపై సర్వత్రా హర్షం



బిలకలగూడూరు గ్రామ సచివాలయం



గడివేముల సచివాలయంలో ఆధార్ సేవలందిస్తున్న సిబ్బంది

గడివేముల: గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ పాలన చేరువ చేయడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు సులభతరంగా అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామ/వార్డు సచివాలయాలను ప్రారంభించారు. ప్రజా సంకల్పయాత్రలో చెప్పిన విధంగా ప్రతి 2 వేల జనాభా కలిగిన గ్రామానికి ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేస్తామన్న హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే జాతిపిత మహాత్మా గాంధీ జయంతి రోజున రాష్ట్రవ్యాప్తంగా గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. సచివాలయాల ద్వారా ప్రజలు, రైతులకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. లక్షలాది మంది నిరుద్యోగులకు సచివాలయాల్లో ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కింది. మండలంలో 14 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఒక్కో సచివాలయంలో వివిధ విభాగాలకు చెందిన 11 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. సచివాలయంలో అన్ని విభాగాలలో కలిపి మండలంలో దాదాపు 140 మంది ఉద్యోగులున్నారు. ప్రతి సచివాలయంలో 545కు పైగా సర్వీసులను ఉద్యోగులు సకాలంలో ప్రజలు, రైతులు, విద్యార్థులకు అందిస్తూ మన్ననలు పొందుతున్నారు. సచివాలయాలకు అనుబంధంగా ఏర్పా టు చేసిన వలంటీర్ వ్యవస్థతో సంక్షేమ పథకాలు ప్రజల ఇళ్ల వద్దకే అందుతున్నాయి, ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించడంతో ఆయా కుటుంబాల ప్రజలకు ప్రభుత్వ సేవలు, పథకాలు పొందడంపై అన్ని విధాలా భరోసా కలిగింది. అర్హత ఉంటే చాలు కులమతాలు, రాజకీయ పార్టీకు సంబంధం లేకుండా పథకాలు మంజూరు చేసి ఇంటి వద్దకే అందిస్తున్నారు. గతంలో మాదిరిగా దళారీ వ్యవస్థ లేకుండా పోయింది. వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రంలోని కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రామాల్లోనే తమ సమస్యలు పరిష్కారం అవుతున్నట్లు లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బాపూజీ కలకు ప్రతిరూపం

జాతిపిత మహాత్మగాంధీ కన్న కలలకు ప్రతిరూపాలుగా గ్రామ/వార్డు సచివాలయాలు ఆవిర్భవించాయి. గ్రామ స్వరాజ్యాన్ని ప్రజలకు చేరువ చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ప్రతి సచివాలయంలో గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శితో పాటు, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్, డిజిటల్ అసిస్టెంట్, వ్యవసాయ, వెటర్నరీ, ఫిషరీష్, సర్వేయర్లు,వీఆర్వోలు అందుబాటులో ఉంటారు.జిల్లా, మండల కేంద్రాల్లో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తుంటే,గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతోంది. అవినీతి కి తావు లేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించడమేధ్యేయంగాసచివాలయాలుపనిచేస్తున్నాయి.

ఆధార్ సేవలు సైతం

వివిధ సంక్షేమ పథకాలు పొందేందుకు ఆధార్ తప్పనిసరి కావడంతో గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలు సైతం అందిస్తున్నారు. మండలంలోని గడిగరేవుల సచివాలయంలో ఇప్పటికే పూర్తిస్థాయిలో సేవలు అందిస్తున్నారు. దీంతో పాటు ప్రతి రోజు ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు వేలాది మందికి ఆధార్ సేవలను అందించారు.

కార్యాలయానికి వెళ్లకుండానే పింఛన్ వచ్చింది



నేను ఏనాడూ ప్రభుత్వ కార్యాలయాల వద్దకు వెళ్లలేదు. గ్రామ వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి అర్హత గురించి తెలుసుకుని పింఛన్‌కు దరఖాస్తు చేయమని చెప్పడంతో ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్సు పత్రాలను ఇచ్చాను. వలంటీరే సచివాలయంలో దరఖాస్తు చేయించాడు. కొన్ని రోజులకు పింఛన్ మంజూరైంది. ప్రతి నెలా ఒకటో తేదీనే రూ.2,750 పింఛన్ సొమ్ము అందుకుంటున్నాను. ఈ సొమ్ము జీవనాధారానికి ఎంతో ఉపయోగపడుతుంది. సీఎం జగనన్న కృతజ్ఞతలు.

– షేక్ ఉసేన్‌బీ, వితంతు పింఛన్ లబ్ధిదారురాలు, తిరుపాడు గ్రామం

ఐదు నిమిషాల్లో అడంగల్



గతంలో 1బీ, అడంగల్ కోసం ఎక్కువ ఖర్చుతో గంటల తరబడి వేచిఉండాల్సిన పరిస్థితి వుండేది. సచివాలయాలు వచ్చిన తరువాత రైతులకు అవసరమైన సేవలు త్వరితగతిన తక్కువ ఖర్చుతో పూర్తవుతున్నాయి. సచివాలయాలలో సులభతరంగా, అవినీతి రహితంగా పనులు జరుగుతున్నాయి. మహాత్మా గాంధీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం కల సాకారం చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుంది. సచివాలయ వ్యవస్థకు దేశంలోనే మంచి గుర్తింపు వచ్చింది.

– శివుడు, రైతు, గడిగరేవుల గ్రామం

90 రోజుల్లోనే ఇంటి స్థలం మంజూరు



గ్రామ సచివాలయంలో వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లోనే నాకు ఇంటి పట్టా అందజేశారు. గతంలో ప్రతి పనికి మండల కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితులు ఉండేవి. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామాల్లోనే సమస్యలను పరిష్కరించేందుకు సచివాలయ వ్యవస్థ ప్రవేశ పెట్టడంతో ఎంతో ఆనందంగా ఉంది. ఉన్న గ్రామంలోనే సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసిన సీఎంకు కృతజ్ఞతలు.

– కొమ్ము రమాదేవి, గృహ లబ్ధిదారురాలు, గడివేముల

ఎంతో సంతృప్తినిస్తోంది



గ్రామాల్లోనే ప్రతిఒక్కరికీ సులభంగా ప్రభుత్వ సేవలు, పథకాలు అందాలనే లక్ష్యంతో సచివాలయాలను ఏర్పాటు చేశారు. గ్రామాల్లోని పేద ప్రజలకు సేవ చేయడం వల్ల ఎంతో ఆనందం కలుగుతోంది. వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయి. లబ్ధిదారులు కార్యాలయాలకు రాకుండనే పనులు పూర్తి చేస్తున్నాం. అర్హత ఉంటే ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నాం. పేదలకు సేవ చేయడం ఎంతో సంతృప్తినిస్తోంది.

– రాజేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, గని గ్రామ సచివాలయం

సిబ్బంది పనితీరుపై నిరంతర పర్యవేక్షణ



మండల పరిధిలోని 14 గ్రామ సచివాలయాల్లో సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సకాలంలో లబ్ధిదారులకు అందించే విధంగా గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది కృషి చేస్తున్నారు. అర్హత ఉంటే చాలు పథకం ఇంటి వద్దకే వస్తుందని ప్రజలు, రైతులు నమ్ముతున్నారు. అర్హత ఉండి వివిధ కారణాలతో పథకాలు అందని వారికి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పథకాలు అందించేలా కృషిచేస్తున్నాం. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వానికి మంచి పేరు వచ్చింది.

– శివమల్లేశ్వరప్ప, ఎంపీడీఓ, గడివేముల

పురాతన ఆలయాలను అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



విగ్రహ ప్రతిష్ట పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని దంపతులు

ఓర్వకల్లు: పురాతన ఆలయాలను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కాల్వ గ్రామంలోని పురాతన ఆలయంలో మహాలక్ష్మి, జమ్ములమ్మ విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలను సర్పంచు కురువ పెద్ద వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఆయన సతీమణి ఉమామహేశ్వరమ్మ, తనయుడు శివనరసింహారెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు హాజరయ్యారు. ముందుగా కాల్వ బుగ్గ దేవస్థాన ప్రధాన అర్చకులు కళ్లె లక్ష్మీనారాయణశర్మ గణపతి పూజలు నిర్వహించి, అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఎమ్మెల్యే దంపతులు భూమి పూజ నిర్వహించి ఆలయ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో మహాలక్ష్మి విగ్రహాన్ని స్థాపించడం సంతోషకరమన్నారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన దాతలను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు నాగిరెడ్డి, స్థానిక నాయకులు చిన్న వెంకటేశ్వర్లు, ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణశర్మ, మహేశ్వరప్ప, విజయకుమారప్ప, శంకరప్ప పాల్గొన్నారు.

పాణ్యంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలి



ద.మ రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎంపీపీ ఉసేన్‌బీ

పాణ్యం: స్థానిక రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలని కోరుతూ డబుల్‌ట్రాక్, డంపిగ్ ట్రాక్ పరిశీలనకు వచ్చిన రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్‌కు ప్రజాప్రతినిధులు వినతిపత్రాలు అందించారు. శుక్రవారం పాణ్యం రైల్వే స్టేషన్‌లో జీఎంను కలిశారు. ఈ సందర్భంగా పాణ్యం రైల్వే స్టేషన్‌లో ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఉసేన్‌బీ, ప్రొఫెసర్ గోపీనాథ్ మాట్లాడుతూ.. గతంలో పాణ్యం రైల్వే స్టేషన్‌లో కొన్ని ఎక్స్‌ప్రెస్‌లు నిలిపేవారని కోవిడ్ విపత్తు అనంతరం రైళ్లను నిలపడం లేదన్నారు. పాణ్యం పరిసర ప్రాంతాల్లో అనేక సిమెంట్ పరిశ్రమలు ఉన్నాయని, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి వేలాది మంది కార్మికులు చేస్తున్నారన్నారు. అలాగే పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, పుణ్యక్షేత్రాల సందర్శనకు వచ్చే భక్తుల సౌకర్యార్థం పాణ్యం స్టేషన్‌లో రైళ్లు నిలపాలని కోరారు. అలాగే డోన్-నంద్యాల రైల్వే లైన్ 174 కి.మీ వద్ద బ్రిడ్జి మూసివేశారని, దీంతో బ్రిడ్జి అవతల ఉన్న సుమారు 250 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్న రైతులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారన్నారు. మూసివేసిన రస్తా స్థానంలో ఆర్‌టీబీ, లేదా ఆర్‌యూబీని నిర్మించి రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని కోరారు. అలాగే పాణ్యం రైల్వే స్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేస్తే అందరికీ సౌకర్యంగా ఉంటుందన్నారు. సానుకులంగా స్పందించిన రైల్వే జీఎం తప్పకుండా నిర్ణయం తీసుకోని ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపేలా చూస్తామన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ, మానవతా తదితర సంఘాల తరఫున జీఎంకు వినతి పత్రం అందించారు. జిల్లా వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు చాంద్, ప్రొఫెసర్ గోపీనాథ్, బాబు, రాజనాల సుధాకర్, కృష్ణారెడ్డి, లక్ష్మీదేవి, బత్తిన ప్రతాప్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

స్టేషన్‌ను శుభ్రంగా ఉంచండి – జీఎం

రైల్వే స్టేషన్‌ను శుభ్రంగా ఉంచాలని జీఎం అరుణ్‌కుమార్ జైన్ సూచించారు. స్టేషన్ బయట ప్రదేశాలు చూసిన ఆయన స్టేషన్‌లో ఆహ్లాదకరమైన గార్డెన్‌ను ఏర్పాటు చేయాలని స్టేషన్‌మాస్టర్ ఆనందరావుకు సూచించారు. బయటి భవనం, పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో పాటు మొక్కలను పెంచాలని సూచించారు. అలాగే స్టేషన్ అవతల ఉన్న జిందాల్ ట్రాక్ గురించి జిందాల్ వారితో మాట్లాడారు. లోడింగ్ తదితర అంశాలపై ఆరా తీశారు. రైల్వే డీఆర్ఎం మనీష్‌అగర్వాల్, ఇంజినీర్లు, సిబ్బంది వెంట ఉన్నారు.

అక్రమ గ్రావెల్‌పై విచారణ



సి.బెళగల్ మండలం బాపణదొడ్డిలో అక్రమంగా గ్రావెల్ తవ్విన ప్రాంతం

కర్నూలు (న్యూటౌన్): కల్లూరు మండలం సల్కాపురం, కె.మార్కాపురం, ఏ.గోకులపాడు పరిధిలోని ఓ ప్రైవేట్ వెంచర్‌లో అక్రమంగా వేసిన ఎర్రమట్టి గ్రావెల్ రోడ్లుపై మైనింగ్ విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టినట్లు మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం సల్కాపురం రోడ్డులో 60 ఎకరాల్లో వేసిన ఓ ప్రైవేట్ వెంచర్‌లో 5,200 క్యూబిక్ మీటర్ల ఎర్రమట్టి గ్రావెల్‌ను ఉపయోగించినట్లు విచారణలో నిర్ధారించారు. ఈ సందర్భంగా మైనింగ్ డీడీ మాట్లాడుతూ.. ప్రైవేట్ వెంచర్‌దారులు అక్రమంగా ఎర్రమట్టి గ్రావెల్ వాడకుండా ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించి గ్రావెల్‌ను ఉపయోగించుకోవాలన్నారు. సల్కాపురం, కె మార్కాపురం, ఏ గోకులపాడు పరిధిలో ఎర్రమట్టి గ్రావెల్‌కు సంబంధించి రాయల్టీ చెల్లించిన పత్రాధారిత సాక్ష్యాలను మైనింగ్ అధికారులకు ఇవ్వాలని కోరారు. అలాగే సి.బెళగల్ మండలం బాపణదొడ్డిలో అక్రమంగా గ్రావెల్ తవ్విన ప్రాంతాన్ని పరిశీలించామని తెలిపారు. ఎర్రమట్టి గ్రావెల్‌ను ఎంత పరిమాణం తవ్వారో కొలతలు వేసి నిర్ధారించినట్లు ఆయన స్పష్టం చేశారు. పూర్తిస్థాయిలో విచారించి అక్రమంగా గ్రావెల్ తవ్విన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, సిబ్బంది పాల్గొన్నారు.

చిత్ర లేఖనం పోటీలు

పాణ్యం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి గ్రంథాలయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాలను తెలుసుకునేందుకు పలు అంశాలల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనాథలకు పండ్లు పంపిణీ



పిల్లలకు పండ్లు, బ్రెడ్ అందజేస్తున్న ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్

కర్నూలు కల్చరల్: విశాఖ శారదా పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర స్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కర్నూలు మండల పరిధిలోని పసుపుల, బి.తాండ్రపాడు గ్రామాల్లోని అనాథ ఆశ్రమాల్లో పిల్లలకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు అందజేశారు. పసుపుల గ్రామంలోని అక్షిత భవాని ట్రస్ట్ బ్లైండ్, బి. తాండ్రపాడు గ్రామంలోని హోమ్ ఆఫ్ హోప్ ఆశ్రమాల్లోని అనాథలు, చెవిటి, మూగ, అంధ పిల్లలతో ఎమ్మెల్యే ముచ్చటించారు. అనంతరం వైస్సాఆర్ సీపీ నాయకులు, అభిమానులతో కలిసి పిల్లలకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ డైరెక్టర్, మండల కన్వీనర్ మహబుబ్‌బాషా, నాయకులు చిన్నలక్ష్మన్న, హరినాథ్ రెడ్డి, మోహన్‌బాబు, శేఖర్, మార్కెట్ డైరెక్టర్ ఇమ్మానియేల్, కృష్ణ, మజీద్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిలో లక్ష్యాన్ని సాధించాలి

- కూలీలకు పని కల్పిస్తామనే భరోసా ఇవ్వాలి
- డిసెంబర్ 15 నాటికి 17 వేల ఇళ్లు పూర్తి కావాలి
- సమర్థవంతంగా కులగణనకు చర్యలు
- సచివాలయాల పరిధిలో కచ్చితంగా 'ఆడుదాం ఆంధ్ర'
- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డా.జి. సృజన

కర్నూలు(అర్బన్): 'జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలుకు సంబంధించిన లక్ష్య సాధనలో వెనుకబడి ఉన్నాం ... ఈ నెల 20వ తేది నాటికి వంద శాతం లక్ష్యాన్ని సాధించాలి. లేకపోతే బాధ్యులపై చర్యలు తప్ప'వని జిల్లా కలెక్టర్ డా.జి. సృజన హెచ్చరించారు. శనివారం సాయంత్రం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఎంపీడీఓ, ఈఓఆర్‌డీ, హౌసింగ్, పీఆర్, కాంట్రాక్టర్లతో ఉపాధి హామీ, హౌసింగ్, ప్రాధాన్యత భవనాలు, ఆడుదాం ఆంధ్ర తదితర అంశాలపై ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 25 లక్షల జనాభాలో 60 వేల మందికి పని కల్పించలేమా? అని ప్రశ్నించారు. వలసలను పూర్తిగా ఆపలేకపోవచ్చు..కొంతమందికైనా పని కల్పించాలి కదా ? అని ఆమె ప్రశ్నించారు. వలసలు వెళ్తున్న మంత్రాలయం, కోసిగి, కౌతాళం మండలాల్లో 60 శాతం పనులు కల్పించడమేమిటని ఎంపీడీఓలను నిలదీశారు. వలసలు పోవాల్సిన అవసరం లేదు, ఉన్న ఊళ్లోనే పనులు కల్పిస్తామనే భరోసా కూలీలకు కలిగించాలన్నారు. ఎన్‌టీఆర్, గుంటూరు, కోనసీమ వంటి వ్యవసాయం ఉన్న జిల్లాల్లోనే 90 శాతానికి పైగా సాధిస్తుంటే మన జిల్లా మాత్రం 84 శాతం మాత్రమే సాధించారని అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఎస్సీ కుటుంబాలకు పనులు కల్పించడంలో కూడా వెనుకబడి ఉన్నామని, మూడు నాలుగు గ్రామాల్లో జీరో ఉందన్నారు. 150 పని దినాలకు అనుమతి వచ్చే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఈ నెలాఖరుకు పెండింగ్‌లో ఉన్న చెత్త సంపద తయారీ కేంద్రాలను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణంపై సమీక్షలో భాగంగా డిసెంబర్ 15వ తేదీ నాటికి 17 వేల ఇళ్లు పూర్తి కావాలని స్పష్టం చేశారు. ఆప్షన్ 3 కింద ఇళ్ల నిర్మాణాలపై కాంట్రాక్టర్లతో సమీక్షించారు. ఇసుక సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో త్వరలో నిర్వహించనున్న కులగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా చేపట్టాలన్నారు. వలంటీర్, సచివాలయ సిబ్బంది సమన్వయంతో ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. కులగణన వివరాల నమోదుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించిందని, ఈ అంశంపై మండలాల్లో త్వరలోనే శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. క్యాస్ట్ సర్టిఫికెట్లు, ఉద్యోగాలు తదితర అంశాలకు ఈ కార్యక్రమానికి ఎటువంటి సంబంధం ఉండదని, సమాచారం కోసమే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. జగనన్న విద్యా దీవెనకు సంబంధించి తల్లి, విద్యార్థికి కలిపి చేయాల్సిన జాయింట్ అకౌంట్లు 20 వేలకు గాను ఇంతవరకు 3 వేలు మాత్రమే ఓపెన్ చేశారని, సంబంధిత వెల్ఫేర్ అసిస్టెంట్‌తో బ్యాంకులకు సంబంధిత డాక్యుమెంట్లు సమర్పించి జాయింట్ అకౌంట్లు త్వరితగతిన ఓపెన్ చేయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ప్రతి సచివాలయం పరిధిలో కచ్చితంగా జరగాలన్నారు. స్పందనలో పంచాయతీరాజ్ శాఖలో ఎక్కువ కేసులు రీ ఓపెన్ అవుతున్నాయని, అసంతృప్తి ఎక్కువగా ఉందని, గడువు లోపు పరిష్కరించాలని ఈఓపీఆర్‌డీలను ఆదేశించారు. సమావేశంలో డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం, జిల్లాపరిషత్ సీఈఓ నాసర రెడ్డి, ఇన్‌చార్జి హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, ఎల్‌డీఎం రామ చంద్రరావు, ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీలు, హౌసింగ్, పంచాయతీరాజ్ శాఖల ఇంజినీర్లు, ఆప్షన్ 3 కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

పుట్టుకతో లోపాలున్న పిల్లలకు ప్రత్యేక చికిత్స



ప్రత్యేక అవసరాలు గల చిన్నారులతో జిల్లా కో-ఆర్డినేటర్ హేమలత

కర్నూలు(హాస్పిటల్): పుట్టుకతో లోపాలున్న పిల్లలకు జిల్లా సత్వర చికిత్స కేంద్రం(డైస్)లో ప్రత్యేక చికిత్స అందిస్తున్నట్లు రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం జిల్లా కో ఆర్డినేటర్ హేమలత అన్నారు. శుక్రవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని డైస్ కేంద్రంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష మెగా ఆరోగ్య శిబిరాల్లో వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పుట్టుకతో లోపాలు గల శిశువు పెరుగుదల, అభివృద్ధిలో ఆలస్యం గల వారికి, ప్రమాదకర లక్షణాలున్న శిశువులను గుర్తించి డైస్‌కు రెఫర్ చేశారన్నారు. ఇక్కడ వారికి ప్రత్యేక వైద్యనిపుణులతో చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డైస్ వైద్యాధికారిణి డాక్టర్ సృజన, మేనేజర్ ఇర్ఫాన్, కేర్ ఇండియా కో ఆర్డినేటర్ రేష్మ, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

రాజకీయ ప్రాధాన్యతతోనే గిరిజనుల అభివృద్ధి



మాట్లాడుతున్న కైలాస్‌నాయక్

కర్నూలు(అర్బన్): రాజకీయ ప్రాధాన్యతతోనే గిరిజనుల అభివృద్ధి సాధ్యమవుతుందని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ కైలాస్ నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఖేతావత్ లక్ష్మణ్‌నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేమెంతమందిమో మాకు అంత వాటా కావాలనే నినాదంతో ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. అన్ని రాజకీయ పార్టీలు మైదాన ప్రాంతాల్లోని గిరిజనులకు రెండు పార్లమెంట్, నాలుగు అసెంబ్లీ స్థానాలను కేటాయించాలన్నారు. తమ హక్కుల సాధన కోసం గిరిజనులు ఉద్యమ సంఘాల్లో చేరి తమ ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. ఉమ్మడి జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేసే ప్రక్రియలో భాగంగా నంద్యాల జిల్లాకు కన్వీనర్లుగా రూఢావత్ రమేష్ నాయక్, దేవావత్ రవినాయక్, రత్నావత్ నాగరాజునాయక్, సోమునాయక్, శ్యామానాయక్, చరన్‌నాయక్, మల్లికార్జుననాయక్‌కు బాధ్యతలు అప్పగించామన్నారు.